# పెద్దోళ్ల పెళ్లి

కథానిక

బి. సాయిప్రభ

అప్పుడే నిద్రలోంచి మేల్కొంటున్న రాజకుమార్తెలాగా లైట్లలో పట్టణం వళ్ళు విరుచుకుంటుంది. ముగ్ధ మనోహరంగా ఆహ్లాదకరంగా ఉన్న ఆ సంధ్యా సమయంలో ఫిల్మ్ ఛాంబర్ రంగు రంగులుగా అలంకరించుకుంది. సామాన్య మానవుని జీవిత పరిమాణానికి కొంచెం ఎత్తుగా ఉన్న ఆవీధిలో ఫిల్మ్ ఛాంబర్ వీధికంతకూ గర్వంగా, ఠీవిగా తల ఎత్తుకుని చూస్తున్నట్టు దర్పంగా ఉంది.

సినిమా తారల ప్రారంభోత్సవాలూ, రాజకీయ నాయకుల ఉపన్యాసాలూ మంత్రుల సమావేశాలూ, ప్రఖ్యాత కళాకారుల ప్రదర్శనలూ, గొప్పగొప్ప వాళ్ళ వివాహాలూ ఫిల్మ్ ఛాంబర్‌లో జరుగుతాయి. అక్కడ అడుగు పెట్టాలంటే ఒక అంబాసిడర్ కారూ, రెండు అంతస్తుల మేడా, గంటకు వెయ్యి రూపాయిలు వేగంతో ఖర్చు పెట్టగల స్తోమతా సామాన్యమైన కనీసపు అర్హతలు.

ఆనాటి ఫిల్మ్ ఛాంబర్ రంగు రంగులుగా రకరకాలు బల్బులతో మెరిసి పోతోంది. అక్కడ మోగుతున్న మంగళ వాద్యాలబట్టి అక్కడ వివాహం జరగ పోతోందని వీధిలో వెళ్తున్న వాళ్ళకి అర్థమవుతోంది.

ముహూర్తం తెల్లవారు ఝామున నాల్గు గంటలకు. అయినా దగ్గర వాళ్ళం, ఆప్తులం అంటూ వచ్చిన వాళ్ల కార్లతో ఆ వీధంతా నిండి పోయింది. ఖరీదయిన మనుషులు ఖరీదుగా కార్లలోంచి దిగి, ఠీవిగా ఖరీదయిన వాతావరణంలోకి అడుగు పెడ్తున్నారు. పెళ్లి పెద్ద గజలక్ష్మి ఫిలిమ్స్ ప్రొడ్యూసర్ చక్రవర్తి, వచ్చిన పెద్ద మనుషుల్ని ఆడంబరంగా ఆహ్వానిస్తున్నాడు.

ఆహ్వానితులైన సినిమా తారలను చూడటానికి, రాబోయే మంత్రులతో స్వామికార్యం, స్వకార్యం కూడా నెరవేర్చు కుందామని వచ్చిన వాళ్ళతోనూ, రిపోర్టర్లతో నూ ఫోటోగ్రాఫర్ల తోనూ హాలంతా రొదగా ఉంది.

చక్రవర్తి ఒకవైపు అందరినీ ఆహ్వానిస్తున్నా, మరోవంక ముఖంలో ఆందోళన కనపడుతోంది. పెళ్ళికొడుకు తరుపున పెద్దలంతా పొద్దున్నే వచ్చేశారు. పెళ్ళికొడుకు ఇంకా రాలేదు. అత్యవసరమైన పనిమీద బొంబాయి వెళ్తున్నానని, నాకోసం ఎదురు చూడవద్దని, పెళ్ళి రోజుకి వస్తానని చెప్పి పెద్దల్ని పంపేశాడు. అతను చెప్పిన సమయం దాటి నాలుగు గంటలయింది. నిముషాలు గడుస్తున్న కొద్దీ చక్రవర్తి మనసులో ఆందోళన అధికమయింది.

ముఖ్యమయిన అతిధులందరూ వచ్చేస్తున్నారు. సినిమా తారలు, మంత్రులు ఒక్కొక్కళ్ళే వస్తున్నారు. వాళ్ళని చూడటానికి వచ్చిన వాళ్ళతో సందు లేకుండా హాలంతా కిటకిటలాడుతోంది. ఆహ్వానితులకు సదుపాయాలు చూడటా

నికి నియమింపబడిన సర్వీస్ బాయిస్ కూల్ డ్రింక్స్ పట్టుకుని హడావిడిగా తిరుగుతున్నారు.

చక్రవర్తి దృష్టి మాటిమాటికీ వాచ్ వైపు వెళ్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలందరినీ వారం రోజులపాటు నిశ్చింతగా పోషించ గల్గిన తన డబ్బు తన అదుర్దాని ఆవగింజంత కూడా సడలించ లేకపోయింది.

చక్రవర్తిగారి అర్ధాంగి లక్ష్మీదేవి అచ్చంగా సినిమాలో లక్ష్మీదేవిలాగా రాళ్ళ నగలతో ధగధగా మెరిసిపోతూ, ఆయన దగ్గరికి హడావిడిగా వచ్చింది. ఆవిడ మొహంలో ఆదుర్దా, కంగారు స్పష్టంగా తెలుస్తోంది. "ఏమిటండీ ఇది?....అబ్బాయి ఇంకా రాలేదు? నాకేదో అనుమానంగా ఉంది." లక్ష్మీదేవి కంగారుగా అంది.

చక్రవర్తి తీక్షణంగా, కఠినంగా లక్ష్మీదేవి వంక చూసాడు. ఇంతలోకి పురోహితుడు కంగారుగా అక్కడికి వచ్చాడు. "అయ్యా! తమరిలా ఓసారి దయచేస్తారా?"....చక్రవర్తిని ప్రక్కకు పిలిచాడు.

కంఠం తగ్గించి మెల్లిగా చక్రవర్తితో అన్నాడు, రహస్యం చెపుతున్నట్టుగా. "బాబూ! కొంప మునిగేటట్టుగా ఉంది. ఆ అబ్బాయి ఇంకా పత్తా లేడు. వాళ్ళ తరఫున బంధువుల్లో అందరూ ఒకటే గుసగుసలుగా చెప్పుకుంటున్నారు. ఇది వరకు కూడా ఒకటి రెండు సార్లు ఇలాగే ముహూర్తం పెట్టించి కట్నం డబ్బు తీసుకుని అయిపులేకుండా వెళ్ళిపోయాడుట పెళ్ళికొడుకు. ఇదేం కొత్త కాదుగా అని అనుకుంటూ ఉంటే విన్నాను. నా మాట నమ్మండి బాబూ ఇందులో ఆవగింజలో అరపాలు కూడా అబద్ధం లేదు. విన్నది. విన్నది విన్నట్టు తమకి మనవి చేశాను. తమరు జాగ్రత్త తీసుకోండి.

పురోహితుడు చెప్పిన మాటలు విని చక్రవర్తి స్తంభించి పోయాడు. ఎంత దుర్మార్గం? .... వాళ్ళ మర్యాద మాటలు, వాళ్ళ దర్జా దర్పం చూసి ఎంత మోసపోయాడు? .... నిజంగా ఇది ఎంత అవమానం?... చక్రవర్తి మొహం అవమానంతో, రోషంతో, కోపంతో ఎఱ్ఱగా కందిపోయింది. ఏమీ మాట్లాడకుండా పెళ్ళికొడుకు తల్లి దండ్రుల దగ్గరికి నడిచాడు.

తన కెదురుగా కోపంగా నడిచి వస్తున్న చక్రవర్తిని చూసి పెళ్ళికొడుకు తండ్రి కంగారుపడ్డాడు. ఎఱ్ఱగా కంది ఉన్న చక్రవర్తి మొహం చూడగానే అతనికి సంగతంతా అర్థం అయిపోయింది. గబగబా లేచివచ్చి రెండు చేతూలూ పట్టుకున్నాడు. "బావ గారూ! మీరు మమ్మల్ని క్షమించాలి. ఆ దౌర్భాగ్యుడు ఇలా ముంచుతాడని కల్లో కూడా అనుకోలేదు. ముందరే రమ్మని ఎంత చెప్పినా సమయానికి దాటేశాడు. ఇలా జరుగుతుందని ఏమాత్రం ఊహించ గల్గినా మాతోపాటే రెక్కలు కట్టి తీసుకొచ్చే వాళ్ళం" అన్నాడు.

ఘాటుగా కడిగేయాలని కోపంగా వచ్చిన చక్రవర్తి దీనంగా ఉన్న ఈ మాటలు విని నీరుగారి పోయాడు. అతనిలో వివేకం తలెత్తింది. ఉన్న పరిస్థితి ఇది. దీనికి ప్రత్యామ్నాయం ఏదో ఆలోచించాలి కాని, రగడ పెట్టుకుంటే

ఇంతమందిలో పరువు పోవటం తప్ప మరేమీ లేదు.

టైం జరజరా పాకిపోతోంది. పెళ్ళి కొడుకు జాడలేదు. చక్రవర్తి ఏమీ తోచని వాడిలా దిగులుగా కూర్చు న్నాడు. అంతా రసభాస అవుతుందా? తనకు సరిగ్గా సరితూగగల సంబంధం కదా అని మిగతావన్నీ తోసిపుచ్చి ఈ సంబంధం కుదిర్చాడు. అంత జాగ్ర త్తగా వివరాలు సేకరించినా మోసపో యాడు తను? ... ఇప్పుడేం చేయ టం?.... ఒక్కగానొక్క కూతురి పెళ్ళి ఇలా అల్లరి పాలు కావల్సిందేనా?...

అప్పుడే వచ్చిన వాళ్ళల్లో గుస గుసలు బయలుదేరాయి. ఈ లగ్నం అగటానికి ఎంత మాత్రం వీలులేదు. కాని ఉన్నపళంగా పెళ్ళికొడుకు ఎక్కడ దొరుకుతాడు? ... చక్రవర్తి చిరాగ్గా పెదిమలు కొరుక్కున్నాడు.

లక్ష్మీదేవి గబగబా వచ్చింది, "ఏమండీ! ఏమిటి? ఏంచేద్దాం? అవ తల ఓ చెంప టైమయి పోతూంటే అలా కూర్చున్నారేమిటి?"

చక్రవర్తి విరుచుకు పడ్డాడు, "ఏం చెయ్యమంటావు నన్ను? ఓ తాడు తీసుకురా! ఇద్దరం కలిసి ఉరి పోసు కుందాం."

"ఏమండీ!" ... లక్ష్మీదేవి చెప్ప బోయేది ఆపేసి భయం భయంగా చూసింది.

"ఏమిటది? చెప్పు."

లక్ష్మీదేవి నోట్లోంచి భయంగా, మెల్లిగా వచ్చాయి మాటలు: "ఏమండీ! శంకరం బాబు ఎవరో స్నేహితుని పెళ్ళికని వచ్చి, ఈ ఊర్లోనే ఉన్నాడు. పొన్నను బజార్లో కనిపించి చెప్పాడు. మనం వెళ్ళి పరిస్థితి వివరించి కాళ్ళు పట్టుకుని బతిమాలితే కాదనడు. నా మాట వినండి. పట్టుదలకి పోతే, ఈ లగ్నం ఆగిపోతే - ఎంత అప్రదిష్టో ఇంతమందిలో - మీరే ఆలోచించండి."

చక్రవర్తి తుపాకీ దెబ్బ తిన్నవాడిలా చూశాడు. "ఏమిటీ! ఆ ముష్టి ఉద్యో గం తప్ప కానీకి గతిలేని శంకరానికి గజలక్ష్మి ఫిలిమ్స్ ప్రొడ్యూసర్ ఏకైక పుత్రిక నివ్వటమా? నీకేమైనా మతి పోయిందా.?"

లక్ష్మీదేవి చక్రవర్తి మాటల్లోని వేడిని పట్టించుకోలేదు. నచ్చ చెపుతున్నట్టుగా అంది: "డబ్బు లేకపోతేనేమండి! పది తరాల వరకూ సరిపోయేంతగా మనకి లేదా? కుర్రాడు చందమామలా ఉం టాడు. మంచివాడు. ముఖ్యంగా అమ్మా యిని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. అన్ని విధాలా తగిన సంబంధం అని కుదుర్చుకున్నది ఇలా ఉంది కదా! అంతకంటె శంకరం ఎన్నో రెట్లు నయం. నేను ముందు నుండీ అంటూనే ఉన్నాను. నా మాట మీరు వినలేదు. ఇప్పటికయినా మించి పోలేదు. నా మాట విని శంకరం దగ్గరికి వెళ్దాం రండి."

చక్రవర్తి ఆలోచనలో పడ్డాడు; శంకరం హఠాత్తుగా మధ్యలో ఎక్కడి నుంచో ఊడిపడిన విలన్ ఏమీ కాడు. చక్రవర్తికి దూరపు చుట్టరికం ఉంది. పెళ్ళింటికి అడపా తడపా వచ్చి పోతూ ఉంటాడు. హైదరాబాద్‌లో ఏదో కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తు న్నాడు. మంచివాడు. అందగాడు. ముందు తన కూతురు పద్మ ఇష్టపడితే తనే వీల్లేదని తోసిపుచ్చాడు. మేరు

పర్వతం మట్టి దిబ్బతో వియ్యమంద డమా? ...యాభై వేల రూపాయలు పెళ్ళి మండపం అలంకరణకి ఖర్చు పెట్టించిన తను యాభై రూపాయలు కూడా బాంక్ బాలన్స్ లేని శంకరానికి కూతుర్ని ఇవ్వడమా? అహం అడ్డొచ్చింది

ఒక్క క్షణం కళ్ళెత్తి హాలంతా పర కాయించి చూశాడు. సంఘంలో పేరు ప్రతిష్టలుగల గొప్ప గొప్ప వాళ్ళంతా ఉన్నారు. ఈ పెళ్ళి ఆగిపోతే పోయిన పరువు మళ్ళీ సంపాదించుకోగలడా? ఒక్క కూతురి పెళ్ళి సరిగ్గా జరిపించ లేని అసమర్థుడని తనని అంతాఅనరూ?

చెయ్యి జారిపోబోతున్న పరువుని గట్టిగా పట్టుకుని లక్ష్మీదేవితో కారులో బయలు దేరాడు చక్రవర్తి.

శంకరం రెండు చేతులూ పట్టుకుని పరిస్థితి వివరించాడు, చక్రవర్తి.

ఒక్క క్షణం శంకరం కళ్ళల్లో అసహనం, పట్టుదల ప్రజ్వరిల్లాయి. ఒకానొకప్పుడు ఈ చక్రవర్తి దృష్టికి తను అనలేదు. ఇప్పుడు అవసరం కొద్దీ కాళ్ళ బేరానికి వచ్చాడు!

కాని అంతలో వెన్నెల లాంటి పద్మ జ్ఞాపకం వచ్చింది. తండ్రి నిరాదరణకు కూతుర్ని శిక్షించడం ఏం భావ్యం?... ఇంత అవసరంలోనూ ఇంకెవరో కాకుండా తనే గుర్తు వచ్చాడు కదా! చక్రవర్తి మనస్సులో తనకి కొంతయినా స్థానం ఉంది అనుకోవడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలి?...

నిముషాల్లో ఏర్పాట్లన్నీ జరిగాయి.

"పెళ్ళికొడుకు మారిపోయాడు" అందరూ హడావిడిగా అనుకున్నారు.

చెక్కు చెదరకుండా గంభీరంగా లగ్నం జరిపిస్తున్నాడు చక్రవర్తి.

పాత పెళ్ళికొడుకు తరుపు వారు తెల్లబోయి చూస్తున్నారు పెళ్ళితంతు.

పాత పెళ్ళికొడుకు తరుపున వచ్చిన స్నేహితులు పెళ్ళికి ఉండటమా మాన టమా అని తికమక పడుతూంటే, పెళ్ళి కొడుకు మారినది కూడా గ్రహించని మంత్రులూ, సినిమా తారలూ ఆనం దంగా అక్షింతలు వధూవరుల నెత్తి మీదచల్లారు.

## అబద్ధాల సంత....'స్రవంతి'

అన్నా! ఈసమాజ మొక
అబద్ధాల సంత!
అయితే ఈ బజారులో
నిజం కూడా దొరుకుతుంది
కాని, సజీవంగా మాత్రం కాదు
నిజాన్ని కబేళాలో తల నరికి
తల క్రిందులుగా కసాయి దుకాణంలో
వ్రేలాడదీసి
కత్తికొక కండగా కోసి
కణకణ మండే నిప్పుల్లో వ్రేల్చి
స్వార్థపు విస్కీతో
నంచుకు తింటున్నారు

వర్గాధిక్యత బారుల్లో
బారులు తీరి కూర్చున్న వాళ్లు!
క్షణమైనా తీరిక లేని పనితో
సతమతమౌతున్న సామాన్యుని
జీవితాన్ని కష్టాల కాష్టం మీదికెక్కించి
చలిగాచుకుంటున్నారు
నాగుబాములే
నాగస్వరాల నూది
పాములవాణ్ణి పట్టి కొట్టించి
బుట్టలో పెట్టేస్తున్నాయి
పడగెత్తుకొని పదవుల చుట్టూ
మ్యూజికల్ చైర్స్ ఆడుతున్నాయి